

రేపు గురు పూజోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఈ నెల 5వ తేదీ గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుపూజోత్సవం జిల్లా స్థాయి కార్యక్రమం సెప్టెంబర్ 5 న ఉదయం 9 గంటలకు చిత్తూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని డిఇవో ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజలు సంయమనం పాటించాలి

- వికోటలో శాంతి భద్రతల పర్యవేక్షణ
- ప్రజలకు కలెక్టర్, ఎస్‌పి సూచన
- ప్రశాంతతకు సహకరించాలన్న ఎమ్మెల్యే



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- వికోట : మండల కేంద్రమైన వికోటలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం 48 గంటల పాటు 144 సెక్షన్ విధించింది. పట్టణంలో మంగళవారం దుకాణాలు మూసివేసి, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. వికోటలోనే మకాం వేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు చర్చించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇరు గ్రూపుల పెద్దలతో శాంతిభద్రతల కమిటీ ఏర్పాటు చేసి వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్య సామరస్య ధోరణిలో పరిష్కారం దిశగా ఇరు గ్రూపులు, శాంతి భద్రతల కమిటీ సభ్యులతో అధికార యంత్రాంగం చర్చించింది.

సోమవారం సాయంత్రం వికోటలో చోటు చేసుకున్న ఇరు గ్రూపుల ఘర్షణ, పరస్పర దాడుల సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను స్థానిక పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి గాలి భాను ప్రకాష్ రెడ్డి స్వయంగా పరిశీలించి బాధితులను పరామర్శించారు. సోమవారం రాత్రి దుండగుల దాడిలో గాయపడ్డ పలమనేరు డిఎస్‌పి ప్రభాకర్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రముఖ జనసేన నాయకుడు పొట్టు భాస్కర్ ఇంటిపై దాడికి పాల్పడి బస్సులను ధ్వంసం చేసిన వారిని, విలేకరులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విన్నవించారు. ప్రజలు సంయమనం పాటించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. నిన్న జరిగిన ఘటన దురదష్టకరమైందని అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న చోట చిరువివాదం ఇలా ఘర్షణకు దారి తీయడం బాధాకరమన్నారు.



దాడుల్లో ధ్వంసమైన బస్సు

ప్రజలు ప్రశాంతతకు సహకరించాలి: ఎమ్మెల్యే

వికోటలో జరిగిన ఘటనలో ప్రజలందరూ సంయమనం పాటించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సూచిం చారు. మండల కేంద్రమైన వికోటలో సోమవారం జరిగిన ఘటన దురదష్టకర మన్నారు. కలెక్టర్, ఎస్‌పిలు రాత్రి పరిస్థితిని అదుపు లోకి తీసుకువచ్చారని ప్రజ లందరూ వారి మాటలు తప్పక పాటించా రన్నారు. గొడవల కారణంగా నష్టపోయిన దుకాణ దారులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ఘటనకు కారకులైన బాధ్యులపై చట్టపరమైన చర్యలు అధికారులు తీసుకుంటారన్నారు. పట్టణంలో నష్టపోయిన దుకాణాలను వారు పరిశీలించారు. నేతలు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, చౌడప్ప పాల్గొన్నారు.



గాయపడ్డ డిఎస్పీ ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

శాంతిభద్రతలు కాపాడాలి: సిపిఎం

చిత్తూరు అర్బన్: వికోట మండల కేంద్రంలో కొంతమంది యువకులు వీధిలో క్రికెట్ ఆడుతుండగా ఓ మహిళకు బంతి తగలడంతో చిన్న గొడవ జరగడంతో దీన్ని సాకుగా చూపి మత ఘర్షణలుగా రెచ్చగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కోరారు. మంగళవారం చిత్తూరు సిపిఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ వికోట మండల కేంద్రంలో యువకులు క్రికెట్ ఆడుతున్న సందర్భంగా పొరపాటున మహిళకు తగిలిన సంఘటనలో భార్యాభర్తలు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వారిని పిలిచి మాట్లాడుతామని చెప్పారని, విషయం సద్దుమణిగే సమయంలో బిజెపి నాయకులు కొంత మందిని పోగేసుకుని మసీదు దగ్గరకెళ్లి రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారని దీంతో ఇరువైపులా ఘర్షణకు చోటు చేసుకున్నాయన్నారు. చిన్నపాటి గొడవను మత ఘర్షణలుగా బిజెపి నాయకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రశాంతమైన వికోటలో మత ఘర్షణలు లేకుండా చూడాలని సూచించారు.



వికోట లో పర్యటిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు

ప్రజలందరూ సంయమనం పాటించాలి : ఎస్పీ

క్రికెట్ ఆడుతూ ఇరు గ్రూపుల ఘర్షణ పడి, వికోట పట్టణంలో లా అండ్ ఆర్డర్ సమస్య ఏర్పడిన నేపథ్యంలో ప్రజలందరూ సంయమయం పాటించాలని ఎస్‌పి మణికంఠ చందోలు విజ్ఞప్తి చేశారు. స్థానిక అర్బన్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ ఘటనకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో అనవసరంగా అనుచితమైన పోస్టులు పెట్టుకొని లా అండ్ ఆర్డర్ సమస్యను తీసుకురావద్దన్నారు. దాడుల్లో నష్టపోయిన వారికి కచ్చితంగా ఆర్డిఓ, తహశీల్దారులకు చెప్పి న్యాయం చేస్తామన్నారు. వికోట పట్టణంలో ప్రజలు ఎవరూ గుంపులుగా తిరగవద్దని మండలంలో పోలీస్ యాక్ట్ 144 సెక్షన్ అమల్లో ఉందని గుర్తించుకోవాలన్నారు. కలెక్టర్‌తో సమన్వయం చేసుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నామని ఇరుగ్రూపులను పిలిపించి మాట్లాడుతామన్నారు.



జిల్లాలో ప్రాజెక్టులు రిజర్వాయర్లు పదిలమేనా..?

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: అధిక వర్షాలతో ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, తెలంగాణాలో ఖమ్మం ప్రాంతాలను వదర నీరు ముంచెత్తింది. నివాసాలు, పంటలు నీటి మునిగి వేల సంఖ్యలో వరద బాధితులు సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మారారు. వరదలతో సర్వం కోల్పోయి ప్రజలు అల్లాడుతుంతే 'తప్పు మీదంటే... మీది..' అంటూ గత ప్రభుత్వంపై కూటమి నాయకులు, 'ప్రస్తుత కూటమి ప్రభుత్వానిదే బాధ్యత' అంటూ వైసిపి నేతలు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. తప్పు ఎవరిదైనా సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటపడ్డ బాధితులకు అదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది.. ఈ విషయం అలా వుంచితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు పదిలమేనా?' అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎప్పుడో నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్‌ల నిర్వహణలో ఇరిగేషన్‌శాఖ అలసత్వం ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు నమోదు కాకపోవడంతో ప్రాజెక్టులు నిండే పరిస్థితి లేదు. రెండేళ్ల క్రితం జిల్లాలో భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు జలకళ సంతరించుకున్నాయి. ఆ తరువాత ఆ స్థాయిలో భారీ వర్షపాతం నమోదు కాలేదు. అప్పట్లో ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్రస్థాయిలో చర్చ నడిచింది. ప్రాజెక్టుల ఆధునీకరణకు నిధులు నాటి ప్రభుత్వం మంజూరు చేసింది. తరువాత కనీసం గేట్లకు గ్రీసుకూడా పూసే పరిస్థితి లేదనే విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎన్‌టిఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టు, కాళంగి, ఆరణి, కళ్యాణి డాం, బహుదా ప్రాజెక్టు ఇక రిజర్వాయర్ల విషయానికి వస్తే జిల్లాలో బాలాజి, మల్లిమడుగు ఉన్నాయి. జిల్లాలోని ప్రాజెక్టులో 30 శాతం నీటి మట్టం ఉన్నట్లు చెబుతున్నారు. వాతారవణ శాఖ హెచ్చరికల మేరకు మరో మూడు రోజుల్లో జిల్లాకు భారీ వర్షసూచనలు వున్న నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిపై ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఏడు వందలకు పై చిన్న, పెద్ద చెరువులున్నాయి. చెరువుల ఆయకట్టు పరిస్థితి అంతంత మాత్రమే.. గతంలో కురిసిన భారీ వర్షలకు అంటే 2021 నవంబర్‌లో జిల్లాలో 694 చెరువులు దెబ్బతిన్నాయి. అప్పట్లో ప్రభుత్వం దెబ్బతిన్న చెరువులు, కాలువలు, ఇతర నీటి పారుదల కట్టడాలు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.12.84 కోట్లు మంజూరు చేసింది. నాటి నుండి జిల్లాలోని చెరువుల పరిస్థితి పట్టించుకోకపోవడంతో జిల్లాలోని అనేక చెరువుల పరిస్థితి దయనీయంగా వుంది. భారీ వర్షలు వస్తే కట్టలు తెగే పరిస్థితి లేకపోలేదు.. ముందస్తుగా ప్రభుత్వం ఇరిగేషన్‌శాఖ ద్వారా ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి కార్యచరణ రూపొందించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రేమ విఫలం

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - రామకుప్పం: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మణింద్రం గ్రామంలో ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మణింద్రం గ్రామానికి చెందిన నారాయణ స్వామి కుమారుడు సాగర్ (21) గత కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆ యువతకి మరో వ్యక్తితో పెళ్లి నిశ్చయమైంది. దీంతో తీవ్ర మనస్థాపనికి గురయ్యాడు. సాగర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫ్యానుకు వేలాడుతున్న సాగర్‌ను కుటుంబ సభ్యులు హుటాహుటిన రామకుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లి గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



సాగర్ (ఫైల్ ఫొటో)



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు వెంకట ప్రసాద్

ఓపికి వచ్చే వారికి గల్ల పరీక్ష చేయాలి

సమీక్షా సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఆదేశం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఓపీకి వచ్చే అందరి వద్ద గల్ల పరీక్షలు చేసి పంపాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ల్యాబ్ టెక్నీషి యన్‌లను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఒ ప్రభావతి దేవి ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పని సరిగా ప్రతి వారం ఒపికి వచ్చే వారిలో పది శాతం మందికి గల్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాలని సూచించారు. గల్ల పరీక్షల నమోదు చాలా తక్కువగా వుందని, రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతి ఒక్కరికి తప్పని సరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ వస్తే ఆరు నెలల పాటు మందులు, పౌష్టికాహారం ఉచితంగా ఇవ్వాలని సూచించారు. స్పర్శ లేని మచ్చలు, అనుమానంగా ఉన్న కేసులను వైద్యాధికారి వద్ద నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి గురువారం అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మలేరియా అధికారి డాక్టర్ అనిల్ మాట్లాడుతూ మనకు డిసెంబర్ వరకు వర్షాభావ పరిస్థితులు వున్న కారణంగా ఈ దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగీ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణ కచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సిలో యాక్టివ్, పాసివ్ స్లైడ్స్ (రక్త పరీక్షలు) వారి లక్ష్యం ప్రకారం తప్పని సరిగా పూర్తి చేయాని సూచించారు. ల్యాబ్ పరీక్షలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎన్‌ఎమ్స్ అందరికీ ఆర్‌డిటి కిట్స్ ఇచ్చి అనుమానిత కేసులను పరీక్షించి అవసరమైతే పిహెచ్‌సి రెఫర్ చేయాలని తెలపాలి. డెంగీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, డ్రమ్ములలో నీరు పట్టుకొని మూత లేకుండా ఉంటే దోమల గుడ్లు పెట్టి లార్వా దోమగా తయారై మనుషులను కుట్టడంతో డెంగీ వచ్చే ప్రమాదం వుందన్నారు. వారంలో ఒకరోజు తప్పని సరిగా డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని, అపరిశుభ్రతతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందన్నారు. ఇళ్ల పరిసరాలలో నీరు నిలువలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించాలన్నారు. ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలన్నారు. దోమ తెరలు వాడాలని, పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. కాచి వడకట్టిన నీరు తాగాలని, ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో లేదా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ లేదా దగ్గరలో ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, యాక్టివ్, పాసివ్ రక్త పరీక్షల నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. పాజిటివ్ వచ్చిన కేసులకు వైద్యాధికారి ద్వారా వెంటనే చికిత్స ప్రారంభించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ రామచంద్ర రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శివ సుబ్రహ్మణ్యం, జిల్లా నలుమూలల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



మండల వైద్యాధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి -తవణంపల్లి: ఏపీ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని మండల వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలుకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి గంగా, మండల అధ్యక్షురాలు వనజాక్షి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 9వ తేదీ అప్పటి ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రతినిధి వర్గంలో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు, సర్క్యులర్స్ వెంటనే విడుదల చేయాలని, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరామన్నారు. ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖాధికారులు, యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాల జీవోలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నామన్నారు. సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశ వర్కర్లకి న్యాయం చేయాలని కోరుకుంటు న్నామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వారు వైద్యాధికారులను కోరారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకురాళ్లు జమున, విజయ్ కుమారి, భారతి పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమిద్దాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి పిలుపు

ప్రజాశక్తి - కుప్పం టౌన్: శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి పిలుపు నిచ్చారు. కుప్పం పట్టణంలోని అన్ని రకాల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మంగళవారం కుప్పం డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా శాస్త్రీయ విద్య కోసం పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఏర్పాటు చేసినప్పటి నుంచి 'చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు..' అంటూ శాస్త్రీయ విద్య కోసం, ఉపాధి కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. నేడు ప్రభుత్వ విద్యా వ్యవస్థని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని దీంతో కార్పొరేట్ వ్యవస్థ వచ్చిన తర్వాత పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అరాకొరా సౌకర్యాలతో విద్యార్థులు ఎలా చదువుకుంటారు?' అని ప్రశ్నించారు. విద్యా సంస్థలలో శాస్త్రీయ విద్య కోసం అధునాతన పరిజ్ఞానంతో పాఠశాలలో కళాశాలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కుప్పంలోని అన్ని ప్రభుత్వ సంస్థలలో చదువుతున్న విద్యార్థులు ఐక్యంగా ఎస్ఎఫ్ఐలో చేరడం అభినందనీయమన్నారు. అన్ని రకాల చదువులు పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు ఉపాధి అవకాశాల కల్పన పాలకుల నిర్ణయాలు చేయాలని డిమాండు చేశారు. నేడు ఉన్నత విద్యా సంస్థలలో మత విద్యను ప్రవేశ పెడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడంతో కొన్ని రాష్ట్రాలు ప్రభుత్వ విద్యను పూర్తిగా ప్రైవేటు మయం చేస్తున్నాయని తెలిపారు. విద్యను సామాన్యులకు అందుబాటులో లేకుండా కొనుక్కొనే పరిస్థితికి తెచ్చారన్నారు. కార్పొరేట్ శక్తుల నుండి విద్యను కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. సామాన్య మధ్య తరగతి విద్యార్థులకు అందరికీ మెరుగైన విద్యను అందించి ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కుప్పం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ అన్ని రకాల విద్యాసంస్థల్లో మెరుగైన నూతన వసతులు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యపై దృష్టి సారించాలని కోరారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ వినోద్, నాయకులు బాలు, సతీష్, నాగార్జున, లక్ష్మీ నరసింహ, సిద్ధార్థ, విజయ్ లతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి

పంట పొలాలపై ధూళి మేఘం!

- క్వారీల దుమ్ము కారణంగా పాడవుతున్న సాగు
- పట్టించుకోని అధికారులు
- దిగుబడి తగ్గుతోందని ఆందోళన
- ఆవేదనలో రైతన్నలు

కంకర ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా పొలాల్లో సాగు చేసిన పంటలపై తీవ్రప్రభావం చూపుతోంది. కంకర దుమ్ము పంటలపై ఆవరిస్తుండడంతో దిగుబడులు తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు పడక సాగునీరు లేక రైతులు నానా కష్టాలు పడుతుంటే కంకర నుంచి వచ్చే ధూళి పెద్ద సమస్యగా మారింది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

ప్రజాశక్తి- నగరి (విజయపురం)

నగరి నియోజకవర్గ పరిధిలో కొండలు అధికంగా ఉండడం, ఇటీవల కాలంలో రోడ్లు, ఇతర నిర్మాణాల పనులు ఎక్కువగా సాగుతుండడంతో అందుకు అవసరమైన కంకర, స్విచ్చు (20 ఎంఎం సైజు కంకర)కు డిమాండ్ పెరిగింది. రైల్వే పనులకు కూడా ఇక్కడి నుంచే కంకర సరఫరా అవుతుంటుంది. ఇలా రోజూ కొన్ని వందల టన్నుల కంకర అవసరమస్తుండటంతో ఫ్యాక్టరీలో నిత్యం నడుస్తూనే ఉంటాయి.

రాత్రి, పగలు తేడా లేదు..

నగరి చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు 15కిపైగా కంకర ఫ్యాక్టరీలు ఉన్నాయి. గుండ్రాజుకుప్పం, రామాపురం, అడవి కొత్తూరులో ఉన్న కంకర ఫ్యాక్టరీ నుంచి దుమ్ము, ధూళి అధికంగా వస్తుండటంతో అక్కడ ఉన్న వ్యవసాయ పొలాల్లో సాగు చేసిన పంటలకు తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదంతా పంటలు లేని వేసవి కాలం వరకు బాగానే ఉన్నా ఖరీఫ్ సీజన్ ప్రారంకావడం, వర్షాలు అడపాదడపా కురుస్తుండటంతో రైతులు పంటల సాగుకు పూనుకున్నారు. అయితే బీడుగా ఉన్నప్పుడు పొలాలపై చేరిన కంకర దుమ్ముతోపాటు పంటలపై కూడా ధూళి చేరుతుండటంతో పంట సాగుపై తీవ్రప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కంకర ఫ్యాక్టరీల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా పని చేయడం ధూళి, దుమ్ము నిత్యం పొలాలపై చేయడం రైతులకు శాపంగా మారింది.

సాగు దిగుబడిపై ప్రభావం..

కంకర నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల సమీప పొలాల్లోని పైరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, దిగుబడులు తగ్గే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసిన పెట్టిన పంట సరైన దిగుబడి రాకుండా తగ్గుతుండటంతో అప్పులే మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు. నిత్యం పంట నష్టం వస్తుండటంతో పంట సాగు చేయడానికి కూడా ముందుకు రావటం లేదు.



కంకర క్వారీ నుండి వెలువడుతున్న దుమ్ము, ధూళి..

రైతులకు అన్నీ కష్టాలే ..

ఇప్పటికే వర్షాలు లేవు.. భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావుల్లో సైతం నీటిమట్టం తగ్గింది. అసలే అప్పులు చేసి సాగు చేసిన పంటలు వర్షాభావం కారణంగా ఎండిపోతున్నాయి. ఇది చాలదన్నట్లు కొండ సమీపంలోని పొలాల్లో కంకర పరిశ్రమల కారణంగా ధూళి మేఘం ఆవరిస్తుండడంతో పంటలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా రెవెన్యూ సదస్సుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మామూళ్లు ముఖ్యం..

కంకర ఫ్యాక్టరీలు అటు రైతులను ఇటు ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నా జిల్లా, మండల స్థాయి అధికారులు పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రైతులు, ప్రజల కష్టాల కంటే ఫ్యాక్టరీ వారు ఇచ్చే మామూళ్లే అధికారులకు ప్రధానంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు మేల్కొని చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసన చేస్తామని రైతులు, గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

ఎండోమెంట్ స్థలంలో 'అన్నా క్యాంటీన్' ఏర్పాటు: ఎంపీ



ఎండోమెంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని మహావీర్ బ్రిడ్జి కింద రైల్వే స్టేషన్ పక్కన ఉన్న జీవ కారుణ్య సంఘానికి చెందిన స్థలంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయ నున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. ఎమ్మెల్యే మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎండోమెంటుకు చెందిన ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని సమస్యలు ఉన్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి తన సొంత నిధులతో ఆ స్థలంలో ఉన్న ముళ్ల కంపలను శుద్ధి చేశామని తెలిపారు. ప్రస్తుతం అధికారులను సంప్రదించి త్వరలోనే పెద్ద ఎత్తున అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదను ఆదుకుంటామని తెలిపారు. ఈ స్థలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో తిమ్మా రెడ్డి , విహెచ్‌పి సభ్యులు, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ వితరణ



సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఓ ప్రత్యేక ప్రతిభావంతురాలైన మహిళకు జనసేన నాయకులు మంగళవారం చక్రాల కుర్చీని వితరణగా అందించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు గ్రామానికి చెందిన గుణసుందరికి పుట్టుకతోనే వికలత్వం ఏర్పడింది. భర్త రోజువారీ కూలీ పనిచేస్తున్నాడు. ఒక పాప వుంది. నడవలేని మహిళకు గతంలో సంబంధిత అధికారులు 50శాతం వికలత్వం వుందని సర్టిఫికెట్ ఇచ్చారు. జనసేన నాయకులు గుర్తించి జీరో పర్సెంట్ రూ.15 వేలు పింఛను తీసుకో వడానికి పూర్తి అర్హత కలిగి వుందని మీడియాకు తెలిపారు. జనసేన గంగాధర నెల్లూరు నియోజకవర్గ బాధ్యులు పొన్న యుగంధర్ ఆ కుటుంబాన్ని పలుకరించగా జగనన్న కాలనీలో తమకు గృహం లేదని తెలిపారు. నూతన ప్రభుత్వంలో కొత్త ఇల్లు మంజూరు అయ్యేందుకు సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళతామని హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్రతిభావంతురాలైన మహిళకు జనసేన ఆధ్వర్యంలో చక్రాల కుర్చీని తన టీమ్‌తో వెళ్లి అందించడంతో స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమం లో జన సైనికులు పాల్గొన్నారు.

డెంగీపై సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: డెంగీ జ్వరంపై సర్వే చేపట్టాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యాధికారి లోహిత్ చెంగల్ రాయలు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం తుంబకుప్పం ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆశా వర్కర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో డెంగీ కేసులు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని దోమల నివారణ చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా లార్వాలను నిషేధించడం, ఫాగింగ్, క్రిమి సంహారక మందులను ఇంటి లోపల పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా దోమలు చనిపోయి డెంగీని నిరోధించే అవకాశం వచ్చునని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి సెంబర్ నుండి జీరో కేసులు నమోదు కావాలని ప్రతి సచివాలయం ఆరోగ్య కార్యకర్త , ఆశా వర్కర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎంఆర్ కేసుల లక్ష్యం విషయంలో వాక్సినేషన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులకు అందించే సేవలను కచ్చితంగా అందించాలని ప్రతి వ్యక్తిని మానిటర్ చేయాలని ట్యాంకుల ప్రతి పంచాయతీలో కార్యదర్శుల ద్వారా ఆరోగ్య కార్యకర్తలకు శుభ్రం చేయిం చాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రమేష్, సూపర్‌వైజర్ అముదా, రమాదేవి, హరికృష్ణ, డిపిఎంఓ మని, లైసన్ అధికారి పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ ఉలవలు



సబ్సిడీ ఉలవలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా వున్నాయని మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి పేర్కొన్నారు. రైతులకు మంగళవారం సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని బెలుపల్లి పంచాయతీకి సంబంధించిన రైతులకు ఖరీఫ్ కాలంలో ప్రధాన పంట వేరుశనగ, సాగు విస్తీర్ణం, వాతావరణ అనుకూలత, భూమిలో ప్రత్యామ్నాయ పంట అయిన ఉలవలు అందించామని తెలిపారు. కూలీల ఖర్చు తగ్గేందుకు రైతులకు అవసరమైన ఉలవలు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో 10 కేజీల ఉలవలు ధర రూ.870 కాగా ప్రభుత్వ సబ్సిడీ 696 రూపాయలు అందిస్తుందని, రైతులు 174 రూపాయలు చెల్లించి పది కేజీల బ్యాగును తీసుకెళ్ల వచ్చునని మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. మండలంలోని ఆర్బీకేలు నాలుగో తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని ఆవసరమైన రైతులు ఆధార్ కార్డు పాస్ బుక్ తీసుకువచ్చి అర్హులైన రైతులు సబ్సిడీ విత్తనాలు తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం శెట్టి, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ద్వారా బుధవారం నుండి మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారిణి భవాని తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 200 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని, 80 శాతం సబ్సిడీతో కేజీ రూ.17.40కు రైతులకు అందించ నున్నట్లు తెలిపారు. మండలంలో వేరుశనగ విత్తనాలు వేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల కింద సబ్సిడీతో ఉలవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు వారి భూమి పట్టదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఆధార్ నెంబర్‌కు లింక్ ఉన్న మొబైల్ ఫోన్‌ను ఆయా రైతుసేవా కేంద్రాలకు తీసుకొచ్చి రైతుల బయోమెట్రిక్ వేయాలని, ఆ తర్వాత ఉలవల విత్తనాలు తీసుకుని వెళ్లవచ్చని వారు పేర్కొన్నారు.

గుడిపల్లి: మండలంలో ఉలవలు విత్తనాలు అవసరమైన వారు రైతు సేవా కేంద్రాలలో నేటి నుండి పేర్లు నమోదు చేసుకోవాలని గుడుపల్లి మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 80 శాతం రాయితీతో ఉలవలను గురువారం ఉదయం 10 గంటలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. 18 రైతు సేవా కేంద్రాల పరిధిలో పంటలు వేయని రైతుల కోసం ప్రత్యామ్నాయ పంటగా ఉలవ విత్తనాలను 80 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 18 రైతు సేవా కేంద్రాల పరిధిలో 390 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

పుంగనూరు: ప్రత్యామ్నాయ పంటగా 80 శాతం రాయితీపై ఉలవ విత్తనాల పంపిణీ చేస్తున్నామని పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సి శివకుమార్ మంగళవారం తెలిపారు. పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 శాతం రాయితీ పైన ఉలవ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. పుంగనూరు వ్యవసాయ డివిజన్‌లో రొంపిచర్ల – 150 క్వింటాళ్లు, పులిచర్లకు 91 క్వింటాళ్లు, సదుమ 103 క్వింటాళ్లు, సోమలకు 173 క్వింటాళ్లు, చౌడేపల్లికి 213 క్వింటాళ్లు, పుంగనూరుకు 294 క్వింటాళ్లు, పెద్దపంజాణికి 360 క్వింటాళ్లు, గంగవరానికి 250 క్వింటాళ్లు మొత్తం పుంగనూరు డివిజన్ కు 1,633 క్వింటాళ్లు సీడ్ ట్రీట్‌మెంట్ కెమికల్‌తో కలిపిన ఉలవలు అందాయని తెలిపారు. బయోమెట్రిక్ పద్ధతిలో విత్తన పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

సోమల: మండలంలోని వ్యవసాయ రైతులకు 80శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న ఉలవలను మంగళవారం కందూరు రైతు భరోసా కేంద్రం వద్ద ప్రారంభించారు. ఏవో సుధాకర్ మాట్లాడుతూ రైతులు తమ పొలాలలో ఉలవలు విత్తుకోవాలనుకునేవారు వారి పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్దకు ఆధార్ కార్డు పాస్ బుక్ జిరాక్స్ తీసుకువెళ్లి బయోమెట్రిక్ పద్ధతిలో ఈనెల 4వ తేదీ నుండి విత్తనాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఆర్ పురం: ఖరీఫ్ లో వేరుశనగ పంటలు వేసుకోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఉలవ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తారని మండల వ్యవసాయ అధికారి నిర్మల అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలో వేరుశనగ వేయని రైతులకు ప్రత్యామ్నాయంగా ఖాళీగా ఉన్న భూములలో ఉలవల పంటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలానికి 138.8 క్వింటాళ్ల ఉలవల విత్తనాలు వచ్చాయి. 80 శాతం సబ్సిడీతో ఒక కేజీ 17.40 రూపాయలు చొప్పున రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరచుకోవాలని అన్నారు.

రెచ్చిపోతున్న గ్రామ సింహాలు

ఆందోళన చెందుతున్న ప్రజలు



ప్రజాశక్తి- విజయపురం: గ్రామ, పట్టణాలలో ఎవరైనా ఒంటరిగా వెళ్లాలంటే కుక్కలకు భయపడాల్సిందే.. గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం పెరగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావటానికి బెంబేలెత్తిపోతున్నారు. విజయపురం, నగరి పట్టణాలలో గత ఆరు నెలలో సుమారు 300కి పైగా కుక్కల దాడిలో గాయపడిన వారు ఉన్నారు. వీరిలో ఒక విజయపురంలో 70 మంది కుక్కల దాడితో తీవ్రంగా గాయపడిన వారు ఉన్నారు. ఈ నెలలో పన్నూరు దళితవాడకు చెందిన ఏసుమణి వీధిలో వెళుతుండగా కుక్కలు దాడి చేశాయి. తిలకరాజ్‌పై కూడా దాడి చేశాయి. ప్రియాంక ఇంటి సమీపంలో నిలుచుకొని ఉండగా కుక్కలు దాడి చేశాయి. అజిత్ అనే వ్యక్తిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఇలా నిత్యం ఎవరో ఒక్కరు కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారు.

ఇకనైనా అధికారులు పట్టించుకోవాలి..

గ్రామం, పట్టణాలలో వీధి కుక్కల నియంత్రణకు అటు మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వీధి కుక్కలను పట్టుకుని యాంటీరేబిస్ ఇంజ క్షన్లు వేయడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాల్టీ నుంచి ఒక్కో కుక్కకు రూ. 500 నుంచి 600ల వరకు ఖర్చు చేస్తుంది. అయిన మున్సిపల్ అధికారులు సిబ్బంది ద్వారా కుక్కలను నియంత్రించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : వర్షాల నేపథ్యంలో.. ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చిత్తూరు పార్లమెంటు నియోజక వర్గ వైద్యాధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రకృతి విపత్తు వరదల రూపంలో విరుచుకుపడి విలయం సృష్టిస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం స్పందించారు. కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం దెబ్బతినే ప్రమాదం వుందని, దీనిపై అధికారులు అప్రమత్తం కావలసిన అవసరం వుందన్నారు. వర్షపు నీటి నిల్వలు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం వుందని, వీటిని అరికట్టడానికి కావలసిన నివారణ చర్యలు చేపట్టాలని చిత్తూరు ఎంపీ సూచించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ముందుకు సాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు చక్కగా పనిచేయాలని, వైద్యాధికారులు తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ప్రజలు ప్రమాదకర వ్యాధుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు, ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఎంపీ ప్రజలకు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడం వల్ల సత్ఫలితాలు నిచ్చాయని ఎంపి ఆయన కృషిని కొనియాడారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఆటో డ్రైవర్లు

ప్రజా శక్తి - సదుం : స్థానిక నడిగడ్డ రోడ్డు గుంతల పడి ద్విచక్ర వాహనాలు, ఆటో లు నడపడానికి వాహనదారులకు ఇబ్బంది కరంగా మారింది. దీంతో ఆటో కార్మికులు కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మంగళవారం నడిగడ్డ రూట్ 'క్రాంతి ఆటో యూనియన్' సభ్యులు సొంత ఖర్చు తో ట్రాక్టర్ తో మట్టి లోడ్లు తెచ్చుకొని, గుంతలకు మట్టి వేసి పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. గత ప్రభుత్వం చేయని పనిని కూటమి ప్రభుత్వం అయినా తమ కష్టాలు అర్థం చేసుకొని, ఇకనైనా సదుం నుండి నాయన పాకాల రోడ్డు వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆటో కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బి రమణ, వై జనార్ధన, శ్రీనివాసులు, వెంకట రమణ, నాగరాజ, రెడ్డప్ప, విజయ్, గంగా ధరం, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మళ్లీ వైసీపీలో చేరడం సిగ్గుచేటు: సజ్జద్ బాషా

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్ ఎండి అమ్ము అలియాస్ రహమతుల్లాలు రెండు నెలల క్రితం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తూ టిడిపిలో చేరినట్లు ప్రకటించారని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్ సజ్జద్ బాష అన్నారు. తిరిగి వారు రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి సమక్షంలో వైసిలో చేరుతున్నట్లు చెప్పడం సిగ్గుచేటని మంగళవారం పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై అనేక ఆరోపణలు చేసి 'పదవులు మాత్రం ఇచ్చారు.. మాకు పవర్ ఇవ్వలేదని ఆరోపించిన మాటలు ఈరోజు గుర్తుకు రాలేదా?' అని విమర్శించారు. పుంగనూరు మున్సిపాల్టీని మీ రాజకీయాలకు వాడుకుని మున్సిపాల్టీని అప్రతిష్ట పాలు చేశారని ఆరోపించారు. ఇష్ట ప్రకారం చేసుకుంటామంటే కుదరదన్నారు. మీ పదవులకు మీరు వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. మీ పదవులకు రాజీనామాలు చేస్తే పట్టణంలో ప్రజలు అందరూ సంతోషంగా ఉంటారన్నారు.

తక్కన్న కుంట సుందరీకరణ పనులు ప్రారంభం: తహశీల్దారు



తక్కన్న గుంట సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -బంగారు పాళెం: తక్కన్నకుంట సుందరీకరణ పనులు చేపట్టినట్టు తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం తహశీల్దారు కుంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే, నాయకుల, దాతల సహకారంతో కుంటను సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, బెంచీలు, టైల్స్ ఏర్పాటు చేసి తక్కన కుంటను సుందరీకరణ పనులు చేపట్టినట్టు తక్కన గుంటను ఎవరు కూడా ఆక్రమించరాదని మండల అభివృద్ధికి ప్రజలు నాయకులు అందరూ సహకరించి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని మన బంగారు పాల్యం మన అభివృద్ధి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అభివృద్ధి పనులకు దాతలు ముందుకు వస్తే నాయకులు సహకారంతో ఈ కార్యక్రమాలన్నీ పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కుంట చుట్టూ సర్వే పూర్తి స్థాయిలో చేయించి ట్రెంచ్ పని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఇబ్రహీం సర్వేయర్ లావణ్య వీఆర్వో రామకృష్ణయ్య పాల్గొన్నారు.

భారీ వర్షం

సంత నిర్వహణకు ఇబ్బందులు



జలమయం అయిన సంత నిర్వహణ ప్రాంతం

ప్రజాశక్తి -వెదురుకుప్పం : మండలంలో వెదురు కుప్పం సంతలో వాన కురవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బంది పడ్డారు. వారంలో ప్రతి మంగళవారం వెరురుకుప్పం సంత నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి , పక్క పంచాయతీల నుంచి రైతులు తమ పండించిన పంటను తెచ్చి అమ్ముకుంటారు. నాణ్యతగా ఉంటాయని ఇటు ఉద్యోగస్తులు, అటు ప్రజలు కొనుగోలు చేసేటందుకు ఇష్టపడతారు. ఇక్కడికి అధిక సంఖ్యలో చేరుకుంటారు. అల్ప పీడన ప్రభావంతో మంగళవారం సాయంత్రం వాన పడటంతో కనీస సౌకర్యాలు లేక నీళ్లలోనే సంతలో అమ్ముకునేటందుకు తెచ్చిన కూరగాయలు తడిసి ముద్దయ్యాయి. కొనుగోలుదారులు ఎవరూ రాకపోవడంతో తాము తెచ్చుకున్న కూరగాయలను వెనక్కి తీసుకెళ్లారు. వర్షానికి, ఎండకు తగిన సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రథమ చికిత్సా కేంద్రాల తనిఖీ



ప్రజాశక్తి -శాంతిపురం: శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలను, మందుల దుకాణాలను తనిఖీ చేశామని వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంద్రాలకు నోటీసులు జారీ చేసినట్టు వైద్యాధికారి తెలిపారు. తనిఖీల సందర్భంగా కేంద్ర నిర్వాహకులు పాటించవలసిన నిబంధనలు వివరించారు. ప్రథమ చికిత్స నిర్వాహకులకు క్లినిక్ నిర్వాహకులు రక్త పరీక్షలు, ఎక్స్ రేలు, ఫిజియోథెరపీ సేవలు అనుమతి లేనిదే చేయకూడదన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం గల్ల పరీక్షలు చేయరాదని, మందుల చీటీ మీద మందులు రాయకూడదన్నారు. మందుల షాపులు, క్లినిక్ నిర్వహించకూడదని సూచించారు. స్టెరాయిడ్, మత్తు మందులు, హార్మోనల్ మందులు వాడకూడదన్నారు. పాముకాటు, తేలుకాటు, పైల్స్, ఫిస్టులా, ఫిషర్, ఎయిడ్స్, క్షయ, చర్మ సంబంధ సమస్యలు గుండెపోటు, పక్షవాతం మొదలగు వాటిపైన మోసపూరిత ప్రకటనలు చేయించరాదని, గర్భవతులు, బాలింతలకు, పిల్లలకు ఎటువంటి వైద్య సేవలను చేయకూడదని ఆదేశించారు. ముఖ్యంగా కాన్పు, అబార్షన్, గర్భస్థ జన్యు సంబంధ వైద్య సేవలను చేయకూడదన్నారు. నిబంధనలను పాటించకుండా ఎవరైనా వైద్య సేవలను అందిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా వైద్య అధికారి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ లతీఫ్ ఖాన్, సూపరువైజర్ కోదండపాణి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలి: సిహెచ్‌వో



మాట్లాడుతున్న యాదమరి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలని యాదమరి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వివాహిత గర్భం దాల్చిన నాటి నుండి తన చిన్నారికి ఐదు సంవత్సరాలు వయసు వచ్చేంతవరకు తీసుకోవాల్సిన టీకాల గూర్చి వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భవతిగా ఉన్న సమయంలో ఆమెకు ఇచ్చే టీకాలు ప్రసవానంతరం చిన్నారులకు ఇచ్చే టీకాలు గూర్చి ఎవరు అడిగిన వారు చెప్పే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పెద్దవారిలో టీబీ జబ్బు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని, దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి ధూమపానం, మద్యపానం సేవించే వారికి కూడా ఈ వ్యాక్సినేషన్ వేయించాలని ఆయన చెప్పారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల 20 శాతం మందిలో టీబీ జబ్బు రాకుండా అరికట్టవచ్చని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, ఎం ఎల్ హెచ్ పి లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయ హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హోం సైన్స్ విభాగం సంప్రదాయ హస్తకళల ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ ప్రారంభించారు. హస్తకళ ప్రదర్శనకు సంబంధించి విద్యార్థినులు సంప్రదాయ కళలైన ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, క్లే వర్క్, పేస్టల్ ఆర్ట్, డైయింగ్, లిప్పాన్ ఆర్ట్, టౌన్ జోర్ పెయింటింగ్, కళంకారీ పెయింటింగ్ మొదలైన కళని ఆధునిక పద్ధతులలో ఫెవిక్రిల్ రంగులను ఉపయోగించి వివిధ రకాల వస్తువుల్ని తయారు చేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి'



మాట్లాడుతున్న పిహెచ్‌సి డాక్టరు బాలాజీ

ప్రజాశక్తి-సోమల: క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాలలో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి సకాలంలో వైద్యం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బాలాజీ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా వైద్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు వ్యాధుల పట్ల తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సందర్భంగా గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించి వర్షపు నీరు నిలువ ఉండి దోమలు ప్రబలి ప్రజలు జ్వర బారిన పడుతున్నారని రోగాల బారిన పడిన రోగులకు సరైన చికిత్స తీసుకోవాలని సూచిస్తూ వారిని ఆరోగ్య కేంద్రానికి పంపి వైద్యం పొందేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన రిటైర్డ్ ఎస్‌పి చిన్నస్వామి



పవన్ కళ్యాణ్‌ను సన్మానిస్తున్న ఎంపీ ప్రసాద్ రావు, రిటైర్డ్ ఎస్‌పి చిన్నస్వామి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రిటైర్డ్ ఎస్‌పి, టిడిపి నేత చిన్న స్వా మి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాత్రి హైదరాబాదులో పవన్ కళ్యాణ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన యోగా పోటీలు

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం పట్టణ పరిధిలోని బైరుగానిపల్లి విశ్వశాంతి యోగా ఆశ్రమంలో మంగళవారం జిల్లా స్థాయి యోగా పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు హాజరయ్యారు. ఈ పోటీలలో జిల్లా పరిధిలోని పలు విద్యాసంస్థల నుండి సుమారు ఎనిమిది వందల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. యోగ గురువు గోపీనాథ్ యోగి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన గురుపూజ మహోత్సవంలో భాగంగా యోగ పోటీలలో నిర్వహించినట్లు తెలిపారు. విశ్వశాంతి యోగాశ్రమం సెక్రటరీ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా చలపతి, వరదరాజులు, జలపతి, విశ్వశాంతి యోగా ఆశ్రమ అధ్యక్షులు సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణపతి ఆలయ మహాకుంభాభిషేకం ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కొత్తపేటలో వినాయక స్వామి ఆలయ మహా కుంబాభిషేకం మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మహా కుంభాభిషేకం 3 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జన సేన ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నో టు పుస్తకాలను పంపిణీ చేశారు. నాయకులు క్రాంతి, డిల్లిప్రసాద్, విష్ణు, కృష్ణ, నాగ్, విజయ్, సాయి, రాజేష్, దిలీప్, వినయ్ పాల్గొన్నారు.

'టీటీడీ ఆలయాలను అభివృద్ధి చేయాలి'

ప్రజాశక్తి-పిచ్చాటూరు: సత్యవేడులో గతవారం భూమి పూజ చేసిన టిటిడి కళ్యాణ మండపం పనులను సందర్శించాలని టిటిడి ఈవో శ్యామల రావును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం ఎమ్మెల్యే తిరుపతిలో ఈఓను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు ఆలయాల వద్ద అభివృద్ధి పనులకు సంబంధించి ఈవోతో చర్చించారు.

ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

ప్రజాశక్తి-కోట: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడు మంది ఎంపికైనట్లు ఎంఈవోలు శైలజ, ధారా మస్తానయ్య తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నాగరాజు, శ్యామల, ప్రతాప్, మంజుల, శ్రీనివాసులు, షేక్ సహతాజ్ బేగం, ఎమ్.వెంకట్రావు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

'ఆదిమూలంపై ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కెవిబిపురం మండలం శ్రీనివాసపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.మావిళ్ళయ్య ఆరోపణలు అవాస్తవమని రాయపేడు గ్రామస్థులు రమేష్ చటర్జీ తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో వారు మాట్లాడారు. కోర్టు పరిధిలో ఉన్న భూమి విషయంలో ఉద్దేశ్యపూర్వకంగా ఎమ్మెల్యే ఆదిమూలంకు ఆపాదించడం సరికాదన్నారు. సమావేశంలో ఏలుమలై, అశోక్, సురేష్, థామస్, శివలింగం, దోరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జన సైనికుడు బత్తల గోపి కుటుంబానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు ఆరణి మదన్ అనుపల్లిలో మంగళవారం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. మంగళవారం జరిగిన బత్తల గోపి అంతిమ యాత్రలో పాల్గొన్న ఆయన గోపి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపి తల్లితండ్రులకు జేఎంసి ట్రస్ట్ తరుపున తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్, దేవర మనోహర్, ఆకేపాటి సుభాషిని, రాజారెడ్డిలు రూ.లక్ష చెక్ అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విజిలెన్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా షీలా లోకనాథన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అవినీతి నిరోధక విజిలెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ గా డాక్టర్ షీలా లోక నాథన్ నియమితుల య్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎం.సామ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి రహిత సమాజం, మహిళా సాధికారత కోసం వ్యూహాత్మక కార్యక్రమాలతో రాష్ట్ర వైస్ చైర్మన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తన నియామకానికి సహకరించిన అవినీతి వ్యతిరేక, విజిలెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ డాక్టర్ ఎం.సామ్ ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ బలోపేతం కోసం సమాజ సంక్షేమంతో పాటు మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి పంచాయతీలో మండల ప్రాథమికోన్న త పాఠశాలలో విద్యార్థులకు జనసేన నాయకులు మంగళవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు విద్యార్థులకు నో ట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందించారు. నాయకులు ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.